మెట్ట ప్రాంతంలో దాహం కేకలు

- తగ్గు ముఖం పట్టిన ప్రాజెక్టుల నీటి మట్టాలు
- 333.84 అడుగులకు చేరుకున్న తమ్మిలేరు జలాశయం
- 261.81 అడుగులకు చేరుకున్న ఎర్ర కాలువ ప్రాజెక్టు
- మూడొంతులు ఎండిపోయిన చెరువులు


తగ్గుముఖం పట్టిన తమ్మిలేరు రిజర్వాయర్ నీటి మట్టం


తగ్గుముఖం పట్టిన ఎర్ర కాలువ జలాశయం నీటి మట్టం

చింతలపూడి: నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల నీటి మట్టాలు తగ్గు ముఖం పడుతున్నాయి. దీంతో మెట్ట ప్రాంతంలో, గిరి పల్లెల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది మే నెలలో కొద్దిపాటి వర్షాలు కురిసినా ఆ తరువాత సరైన వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జల మట్టం నానాటికీ పడి పోతోంది. భూగర్భ జలాలపై ఆధారపడిన మెట్ట ప్రాంతంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో చెరువులు ఎండిపోవడంతో పశువులు కూడా తాగు నీటికి తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని జూన్ ఆఖరులో, జూలైలో తొలకరి వర్షాలు కురిసి ప్రాజెక్టుల్లోకి నీరు చేరితే పరిస్థితి చక్కబడుతుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

ఎర్ర కాలువ

సుమారు 19 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్న కొంగువారిగూడెం కరాటం కృష్ణమూర్తి ఎర్ర కాలువ ప్రాజెక్టు జలాశయం నీటి మట్టం 261.81 అడుగులకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం ప్రతి ఏటా వర్షా కాలంలో వృథాగా పోతున్న వేల క్యూసెక్కుల ఎర్రకాలువ వరద నీటిని సాగు నీటికి వినియోగించుకోవాలన్న ఉద్దేశ్యంతో పోలవరం నియోజకవర్గంలోని టి నరసాపురం సమీపంలో నందమూరి విజయసాగర్ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మించింది. అప్పటి నుంచి ప్రాజెక్టు కింద అధికారికంగా సుమారు 1,000 ఎకరాలు, అనధికారికంగా మరో 1,000 ఎకరాలు సాగవుతుంది. ఎర్రకాలువ ఎండిపోతే నందమూరి విజయసాగర్ ప్రాజెక్టు కూడా నిరుపయోగంగా మారే ప్రమాదం ఉంది.

తగ్గుముఖం పట్టిన తమ్మిలేరు జలాశయం

చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం సమీపంలో 3 టీఎంసీల సామర్థ్యం గల జలాశయాన్ని నిర్మించారు. ప్రాజెక్టు కింద ఏలూరు జిల్లాలో 4,200 ఎకరాలు, ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లాలో 4,969 ఎకరాలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో నీరు ఉంటే చుట్టు పక్కల మండలాల్లో భూగర్భ జలాలు సంవృద్ధిగా ఉంటాయి. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 355 అడుగులు. ప్రస్తుతం ప్రాజెక్టులో 333.84 అడుగుల నీటి మట్టం ఉంది. దీంతో పలు గ్రామాల్లో భూగర్భ నీటి మట్టం తగ్గు ముఖం పడుతుంది.

ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తే మెట్టకు సాగునీటి కష్టాలు తప్పుతాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటి వరకు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకోలేదు. తక్షణం నిధులు కేటాయించి చింతలపూడి పథకాన్ని పూర్తి చేయాలి.



–చిలుకూరి జ్ఞానారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు

జాయింట్ ఎల్‌పీఎంల సబ్ డివిజన్‌పై సమీక్ష


రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కొయ్యలగూడెం: జాయింట్ ఎల్‌పీఎంలను సబ్ డివిజన్ చేసే ప్రక్రియలో అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని తహసీల్దార్ ఎన్.నాగరాజు ఆదేశించారు. శనివారం రెవెన్యూ అధికారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రీ సర్వే చేసిన గ్రామాల్లో 2,677 జాయింట్ ఎల్‌పీఎం పట్టాదారులను గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు పట్టాదారుల విభజన చేసి, వ్యక్తిగత ఎల్‌పీఎంలను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి అన్ని గ్రామాల్లో ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని జాయింట్ ఎల్‌పీఎంలు గల రైతులు తమ భూమికి సంబంధించిన రికార్డులతో వీఆర్వో లేదా సర్వేయర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వెంకట్రాయుడికి సత్కారం


చిన్నమిల్లిని సత్కరిస్తున్న ద్వారకాతిరుమల మండల నాయకులు

ద్వారకాతిరుమల: చిన్నమిల్లి వెంకట్రాయుడు వైఎస్సార్‌సీపీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా శనివారం ఆయనకు భీమవరంలో అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ద్వారకాతిరుమల మండలం నుంచి పార్టీ నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వెంకట్రాయుడికి పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ మస్తాన్ బాషా, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, కొడుదుల ప్రసాద్ ఘనంగా సత్కరించారు.

చిన్న వెంకన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో క్షేత్ర పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. అలాగే ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివెట్టి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. అలాగే ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

శ్రీవారి నిత్యాన్నదానానికి విరాళం


దాత వీరాస్వామికి విరాళం బాండ్‌ను అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం రూ.1,11,116 విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన గారపాటి వీరాస్వామి ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్‌ను అందజేశారు.

డ్యూటీ పెయిడ్ మద్యం సీసాల పట్టివేత


మద్యం నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

కామవరపుకోట: చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలో జీలకర్రగూడెం గ్రామంలో కేవీఆర్ రెస్టారెంట్, దాబాలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విభూది గంగాధర్‌రావు వద్ద నుంచి 180 ఎంఎల్ పరిమాణం గల 6 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు పట్టుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, ఎండీ ఆరీఫ్, జె.జగ్గారావు సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేదవర్గాలు, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, విద్యార్థులకు మేలు చేసేలా గత ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ గుర్తు చేశారు. పార్టీ స్థానిక కార్యాలయంలో నూతనంగా ఏలూరు నగర పార్టీ ఈసీ మెంబర్లుగా నియమితులైన బయ్యవరపు జగదీష్, శానంపూడి మోహన్ జయప్రకాష్‌ని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు ఆధ్వర్యంలో వారంతా సమన్వయకర్త జయప్రకాష్‌ను కలిసి కొద్దిసేపు పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యేసుపాదం, బుజ్జమ్మ, కిషోర్, విజయ్, భరత్, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు


సీఐ సుభాష్ కుటుంబ సభ్యులకు వేదాశీర్వాదం అందజేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు సుప్రభాత సేవ, తోమాల సేవ, తీర్థ ప్రసాద గోష్ఠి, బాలభోగ నివేదన, తదితర పూజలు నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. జంగారెడ్డిగూడెం సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎంవీ సుభాష్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, పూజా కార్యక్రమాలు అనంతరం వేదాశీర్వాదం అందించారు. ఈవో కలగర శ్రీనివాస్ స్వామి వారి శేష వస్త్రాలు అందించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిమ్మగడ్డ సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, నిమ్మగడ్డ రామకృష్ణ, కుసుమరాణి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కర్పూరం కృష్ణ, కర్పూరం హరికృష్ణ, కూచిపూడి రమేష్, ధారా రవీంద్ర, ఫణీంద్ర, పేరిచర్ల జగపతిరాజు, రెడ్డిరంగప్రసాద్, దండు ధనరాజు, వాసవీ సాయినగేష్ తదితరులు పాల్గొన్నారు.

కదిలిన యంత్రాంగం


అచ్యుతాపురం–శ్రీరంగపట్నం రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో, పంచాయతీరాజ్ శాఖ అధికారులు

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: అచ్యుతాపురం–శ్రీరంగపట్నం రోడ్డు అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. సాక్షిలో 21వ తేదీన ప్రచురితమైన ‘కొద్దిపాటి వర్షానికే ముప్పు’ శీర్షికకు ఉన్నతాధికారులు స్పందించి, పరిష్కార చర్యలకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు పరిస్థితి అధ్యయనం చేశామన్నారు. రూ.30 లక్షల అంచనా వ్యయంతో మెటల్ రోడ్డు నిర్మాణాన్ని చేపడతామని ఆయన గ్రామ ప్రజా ప్రతినిధులతో పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలోగా రహదారి ప్రయాణికులకు రాకపోకలు సాగించడానికి అనువుగా తాత్కాలికంగా ఉపాధి శ్రామికులతో కలిసి పనులు చేపట్టాల్సిందిగా ఎంపీడీవోను, పంచాయతీరాజ్ ఎఈ సురేష్‌ను గ్రామస్తులు కోరారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎం రామారావు

జంగారెడ్డిగూడెం: డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్.నిర్మల అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మండల ఏపీఎం రామారావు హాజరై మాట్లాడారు. డ్వాక్రా పొదుపు సంఘాలు ప్రారంభమై జూన్ 8వ తేదీకి 25 సంవత్సరాలు పూర్తయ్యాయని, డ్వాక్రా మహిళలు దినదిన అభివృద్ధి చెందడానికి, ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి, వీవోఏ ఆర్పీ జిల్లాకార్యదర్శి ఎస్‌కే సుభాషిణీలు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు ఎంత వరకు అమలవుతున్నాయో అవగాహన లేక నష్టపడుతున్నారన్నారు. డ్వాక్రా మహిళలను అన్ని బ్యాంకుల నుంచి 0 వడ్డీ ఇచ్చేలా, అవి డ్వాక్రా గ్రూపులకు పూర్తిగా వేయాలన్నారు. డ్వాక్రా యానిమేటర్లు, ఆర్పీలకు పూర్తి వేతనాలు వేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, సీఐటీయూ నేత పి.సూర్యరావు, నాయకులు జి.సూర్యకిరణ్, చంటి, డ్వాక్రా మహిళలు వై.సీతమ్మ జి.కృష్ణవేణి, టి.ప్రేమకుమారి, పొట్ల సీతమ్మ, ఇరగవరం సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కామవరపుకోట: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సరళ కుమారి


బుట్టాయగూడెం: డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కామవరపుకోట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలు వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని ఎంపీడీవో ముళ్లగిరి సరళకుమారి అన్నారు. శనివారం తడికలపూడి గ్రామంలోజరిగిన స్వచ్ఛ ఆంధ్రా–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో తడికలపూడి పంచాయతీ కార్యదర్శి కె.నాగరాజు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ‘పరిసరాల పరిశుభ్రత’

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ పీయూవీఎస్ మునీంద్రరావు మొక్కలు నాటారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎస్.అక్కులన్న, తహసీల్దార్ పీవీ చలపతిరావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం


చింతలపూడి: నియోజకవర్గంలో యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు, తదితరులు


కేఆర్ పురం ఐటీడీఏ వద్ద యోగాసనాలు వేస్తున్న పీవో రాములు నాయక్, ఇతర అధికారులు

చింతలపూడి / పోలవరం రూరల్ : యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని యోగా గురువు జె.సూరారెడ్డి అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతలపూడిలో శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాఠశాలలు, సచివాలయాలు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలవరం మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి పలు ఆసనాలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాయిరాజు, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కామవరపుకోట మండలంలో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఎం.సరళ కుమారి, తహసీల్దార్ గడ్డం ఎలీసా తదితరులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలో జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, డీఎల్‌డీవో రాజు, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎంపీపీ కొదమ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ద్వారకాతిరుమల మండలంలో జరిగిన కార్యక్రమాల్లో చిన వెంకన్న దేవస్థానం ఈవో ఎన్‌వీ సత్యనారాయణమూర్తి, ఈఈ డీవీ భాస్కర్, ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. కామవరపుకోట మండలంలో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బుట్టాయగూడెం మండలంలో జరిగిన కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.రాములునాయక్, ఎంపీడీఓ కె.జ్యోతి, తహసీల్దార్ పీవీ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మురికి కూపంలో దళితవాడ


డ్రెయినేజీ నీటితో ముంపునకు గురైన దళితవాడ

కొయ్యలగూడెం: మురుగు నీరు ముంపులో తాము పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించాలని పరింపూడి దళితవాడకు చెందిన స్థానికులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న దళితవాడ ప్రాంతంలోని తూర్పు వైపున తాము నివసిస్తున్న వీధులన్నీ మురుగు నీటితో ముంపునకు గురయ్యాయన్నారు. కొయ్యలగూడెంలోని ఎగువన వదిలేస్తున్న మురుగు నీరు అంతా తమ ప్రాంతాన్ని ముంచెత్తుతుందని వర్షాకాలంలో అయితే తాము నివాసాలను వదిలి బస్టాండ్‌లో లేదా చర్చిల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. దాదాపు 25 సంవత్సరాలకు పైగా ఉన్న ఈ సమస్యను ఏ ఒక్కరూ పరిష్కరించలేదని వాపోయారు. మురుగు నీటి పారుదలకు అవకాశం లేకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

పూజాసామగ్రి విక్రయాలపై వ్యాపారుల మధ్య విభేదాలు


తులసి మాలల విక్రయ దుకాణంలో పూజాసామగ్రి అమ్ముతున్న వ్యాపారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ దుకాణంలో తులసి మాలలు విక్రయాల పేరుతో పూజా సామగ్రిని విక్రయిస్తుండటం వివాదాస్పదమవుతోంది. తమకు మాత్రమే పూజా సామగ్రి విక్రయించుకునే హక్కు ఉండగా, తులసి మాలలు విక్రయించే వ్యక్తి ఎలా పూజా సామగ్రిని అమ్ముతాడని కొబ్బరికాయల విక్రయ దుకాణదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఇది వివాదాస్పదంగా మారింది. వివరాల్లోకి వెళితే.. శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో కొందరు పోటీ పడి మరీ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే వారు నిబంధనలను మీరుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. షాపు నంబర్–8లో రెండేళ్ల పాటు తులసి మాలలు విక్రయించుకునేందుకు ఈ ఏడాది మార్చి 22న దేవస్థానం అధికారులు బహిరంగ వేలంతో పాటు, సీల్ టెండర్‌ను నిర్వహించారు. సీల్ టెండర్ ద్వారా పాటను దక్కించుకున్న వ్యాపారి తులసి మాలలతో పాటు పూజా సామగ్రిని విక్రయిస్తున్నాడు. అయితే పక్కనే ఉన్న కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయ దుకాణదారులు ఇదేం దారుణమని గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలోనే తమ మధ్య గొడవలు జరుగుతున్నాయని, ఇవి తారాస్థాయికి చేరే ప్రమాదం ఉందని అంటున్నారు. దీనిపై ఆలయ అధికారులు దృష్టి సారించి, టెండర్ షరతుల ప్రకారం వ్యాపారాలు జరిగేలా చర్యలు చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కమిటీ సభ్యులను సత్కరించిన ఉపాధ్యాయులు

కొయ్యలగూడెం: మానవతా మండల శాఖ 2025–26 సంవత్సరానికి సంబంధించి కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం వీఎస్ఎన్ కళాశాలలో నిర్వహించారు. అధ్యక్షుడిగా మందపాటి రామకృష్ణ, కార్యదర్శిగా తిగిరిపల్లి చంటిబాబు, కోశాధికారిగా చవ్వా రామ సత్యనారాయణలను నియమించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు రూ.10 వేల విలువైన నోట్ బుక్స్ ప్రధాన ఉపాధ్యాయులకు నూతన కమిటీ సభ్యులు అందజేశారు. సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించే విధంగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకార సందర్భంగా పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులుగా తిర్నాతి సిద్ధార్థ, ఎస్‌బీజీ శేఖర్, అమీర్‌భాషా, వీవీవీ సర్వేశ్వరరావు, మట్టే శ్రీనివాసరావు, నక్క రాములను పలు విభాగాలకు నియమించారు. వీఎస్ఎన్ స్వామి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, మాజేటి ఉమా, సంకు మధు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ముఖ గుర్తింపు తప్పనిసరి

భీమడోలు: జూలై ఒకటవ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పంపిణీ సమయంలో ముఖ గుర్తింపు తప్పనిసరని జిల్లా ఐసీడీఎస్ పీడీ పి.శారద అన్నారు. భీమడోలు మండలం గుండుగొలను అంగన్‌వాడీ కేంద్రం–23ను శనివారం పీఓ ఎంఎస్ రాజశేఖర్‌తో కలిసి ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. లబ్ధిదారులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం కవిత, టీచర్ బోడ రాజమణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.